క్లుప్తంగా

కేబుల్ వైర్ల తొలగింపు



బీఎస్‌పీ కాలనీలో విద్యుత్ కేబుల్స్‌ను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

మోతీనగర్: నగరంలో ఇటీవల విద్యుత్ స్తంభాలకు ఉన్న వివిధ రకాల కేబుల్స్‌ను తొలగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగానే శనివారం ఎర్రగడ్డ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మూసాపేట డివిజన్ మోతీనగర్, అవంతినగర్ తోట, అవంతినగర్, బాలాజీ స్వర్ణపురి కాలనీ, పాండురంగ నగర్, పీఆర్ నగర్ సెక్షన్లతో పాటు వివిధ ప్రాంతాలలో ఉన్న విద్యుత్ స్తంభాలకు ఉన్న వివిధ రకాల కేబుల్స్‌ను తొలగించారు. అంతేకాకుండా తొలగించిన కేబుల్స్‌ను వెంటనే తరలించారు. ఈ సందర్భంగా ఎర్రగడ్డ సెక్టార్ ఏఈ తబ్రేజ్ మాట్లాడుతూ.. స్తంభాలకు ఎలాంటి కేబుల్స్‌ను అనుమతి లేకుండా అమర్చితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేటి నుంచి సప్తాహ జ్ఞాన యజ్ఞ మహోత్సవం

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారదా శంకరమఠంలో బ్రహ్మశ్రీ ప్రాచార్య శలాక రఘునాథ శర్మ ఆధ్వర్యంలో శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞ మహోత్సవం ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 8 వరకు జరగనుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మశ్రీ ఇనుగంటి సోమయాజులుచే శ్రీమద్భాగవత పారాయణం, నిత్యపూజలు ఉంటాయని తెలిపారు.

మేధో సంపత్తి హక్కులపై అవగాహన

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్ గోల్డెన్ జూబ్లీ హాల్‌లో శనివారం మేధో సంపత్తి హక్కులపై ఒక్కరోజు వర్క్ షాపు నిర్వహించారు. కార్యక్రమాన్ని జేఎన్‌టీయూహెచ్, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించాయి. టీఎస్‌సీఓఎస్‌టీ, ఐసీఏఆర్, సీఎస్ఐఆర్, ఐఐసీటీ నుంచి రిసోర్సు పర్సన్లు హాజరయ్యారు. ఐసీఏఆర్ మాజీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కల్పన శాస్త్రి హాజరై సమాజ ప్రయోజనాల కోసం ఆవిష్కరణలను ప్రభావితం చేసే ఐపి మేనేజ్‌మెంట్ స్ట్రాటజీల గురించి అవగాహన కల్పించారు. భారత ప్రభుత్వ భారతీయ పేటెంట్ కార్యాలయంలో మాజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్స్ సైంటిస్టు డా. రాజు గుర్రపు పేటెంట్ల రకాలు, దరఖాస్తు విధానం, ప్రాసిక్యూషన్, కమర్షియలైజేషన్ గురించి వివరించారు. కార్యక్రమంలో శాశ్వత ఫ్యాకల్టీ సభ్యులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్స్, పీజీ విద్యార్థులు, జూనియర్ అసిస్టెంట్లు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి. నరసింహారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వి.ఎస్.ఎస్. గిరిధర్ పాల్గొన్నారు.



హనుమాన్ దేవాలయం ఎదురుగా ప్రధాన రోడ్డులో మినీ డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న చెత్తా చెదారం

ఇదేం చెత్త..

తరలించకుంటే ఎట్ల!

పేరుకుపోయిన చెత్త, ఇతర వ్యర్థాలు
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

మోతీనగర్:

పూర్వ మోతీనగర్ డివిజన్‌లో ఎటు చూసినా ప్రధాన రోడ్లు, బస్తీ, కాలనీల్లో ఉన్న ఇళ్ల మధ్యన చెత్తా చెదారం పేరుకుపోయింది. మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌లలో ప్రధాన వీధుల్లో వినాయక చవితి పండుగకు సంబంధించిన పూలు, పత్రితో పాటు పలు రకాల వస్తువులను విక్రయిస్తుంటారు. మిగిలిన వస్తువులను రోడ్ల పక్కనే వేయడంతో అవి వర్షాల వల్ల దుర్గంధం, దుర్వాసన వస్తుంది. ప్రధాన రోడ్డుతో పాటు అంతర్గత రోడ్లు కూడా ఇరుకుగా ఉంటాయి. వాటికి తోడు చెత్తా చెదారం కుప్పలు ఎక్కడ పడితే అక్కడ వేశారు. వాటిని తొలగించాల్సిన జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం సిబ్బంది వారం రోజులుగా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు సమీపంలో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా అల్లాపూర్ డివిజన్‌లోని గాయత్రినగర్, తులసినగర్, వి. రామారావు నగర్, శివాజీనగర్, రాణాప్రతాప్ నగర్, పర్వత్‌నగర్, శ్రీవివేకానందనగర్‌తో పాటు పలు బస్తీ, కాలనీల్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తున్నాయి. టన్నుల కొద్దీ చెత్తా చెదారం మినీ డంపింగ్ యార్డుల్లాగా రోడ్లపై కుప్పలు కుప్పలుగా ఉన్నాయి. అదే విధంగా మూసాపేట డివిజన్‌లోని మోతీనగర్, బబ్బుగూడ, పాండురంగ నగర్, స్నేహపురి కాలనీ, బాలాజీ స్వర్ణపురి కాలనీ, మోతీనగర్ ప్రధాన రోడ్డులో చెత్తా చెదారం దర్శనమిస్తున్నాయి. చిరువ్యాపారులు, బాటసారులు వాటిని దాటుకుంటూ దుర్గంధం, దుర్వాసన రావటంతో ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త కుప్పలను తరలించాల్సిందిగా ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



వి. రామారావు నగర్ హిందూ శ్మశాన వాటిక ఎదురుగా పేరుకుపోయిన చెత్తా చెదారం



మోతీనగర్ ప్రధాన రోడ్డు పక్కన..



మోతీనగర్ ప్రధాన రోడ్డులోని ఐడీబీ బ్యాంక్ సమీపంలో..



ఫుట్‌పాత్ పక్కన వేసిన చెత్తా చెదారం

ఫ్లాట్ల కొనుగోలుదారులకు అండగా ఉంటా

ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

నిజాంపేట్: రిటైర్‌మెంట్ డబ్బులతో అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్లు కొనుగోలు చేసిన వారిని మోసం చేయడం ధర్మం కాదని, సదరు కన్‌స్ట్రక్షన్ కంపెనీ యాజమాన్యంపై కోర్టులో కొట్లాడతానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం బాచుపల్లిలో ఫసిఫికా కన్‌స్ట్రక్షన్ – ఆవాస్ నెబ్యూలా అపార్టుమెంట్ వద్ద ఫ్లాట్ల కొనుగోదారులు చేపట్టిన ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ కంపెనీలు, ఉద్యోగ విరమణ అయిన ఉద్యోగులు మొత్తం 2724 మంది ఫ్లాట్లు కొనుగోలు చేశారని, వారిని ఫసిఫికా కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం మోసం చేసిందన్నారు. కోర్టుల్లో కేసులు వేసి, బౌన్సర్లతో యాజమాన్యం బాధితులను భయభ్రాంతులకు గురి చేస్తోందని ఆరోపించారు. బౌన్సర్లు ఎవరిమీదైనా చేయి చేసుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



సాక్షి, సిటీబ్యూరో: భరత్ నగర్ పరిధి శక్తినగర్ కాలనీలోని వినాయక మండపంలో చిన్నారుల నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. వెంపటి కూచిపూడి డ్యాన్స్ అకాడమీకి చెందిన గురువు లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో చిన్నారులు మిహిర, ధార్వి, మనుశ్రీ, స్నిగ్ధ, స్నేహిత, మనోజ్ఞ, శిరీష, సుచిత్ర, క్రాంతి కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం వారికి శక్తినగర్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

నిజాంపేట్: లైఫ్ చారిటబుల్ ట్రస్ట్, ఒరాకిల్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రగతి నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, హెల్త్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎలాంటి కోర్సులు ఎంచుకోవాలి, వారి లక్ష్యాన్ని చేరుకోడానికి ఏ మార్గాలు అనుసరించాలి అనే విషయాలను వివరించారు. అదే విధంగా మంచి ఆరోగ్యం కోసం విద్యార్థులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.ప్రశాంత్ కుమార్, హెచ్‌ఎం చెన్నయ్య, ఉపాధ్యాయులు, ఒరాకిల్ సంస్థ ప్రతినిధులు కిషన్, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు

ఆకట్టుకుంటున్న కళాసిల్క్ ఎగ్జిబిషన్





మోతీనగర్: ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులకు చేయూత అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కళాసిల్క్ నిర్వాహకులు వినోద్‌జైన్ అన్నారు. మోతీనగర్ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్త కళ ప్రదర్శన కళా సిల్క్ ఎగ్జిబిషన్‌కు స్థానికుల నుంచి విశేషస్పందన లభిస్తున్నదని తెలిపారు. ఈ ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్‌లోని ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడ, అస్సాంలోని మూగా ఎరిశిల్క్, బిహార్‌లోని భగల్పూర సిల్క్స్, టస్సర్, ఛత్తీస్‌గఢ్ ట్రిబిల్ వర్క్, కోసా సిల్క్, గుజరాత్‌లోని బాందని కచ్చ ఎంబ్రాయిడరీ డ్రెస్, చీరలు, జమ్ము కాశ్మీర్‌లోని ఎంబ్రాయిడరీ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, పాస్మిన్ శాల్, కర్ణాటకలోని క్రేప్, ప్రింటెడ్ చీరలు, మధ్య ప్రదేశ్‌లోని చందేరి, మహేశ్వరి, రాజస్థాన్‌లోని కోటా, బంధాని, బ్లాక్‌ప్రింట్స్, సంగ్నరి ప్రింట్స్, డ్రెస్ మెటీరియల్స్, తెలంగాణలోని గద్వాల్, నారాయణపేట, పోచంపల్లి ఉత్తరప్రదేశ్‌లోని జామ్దాని బనారస్ లక్నోవి డ్రెస్ మెటీరియల్స్, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, హ్యాండీ క్రాఫ్ట్స్, బంజార, కొత్తకత్తా బ్యాగులు, ఒరిస్సా పెయింటింగ్ హ్యాండి క్రాఫ్ట్స్ వంటి అనేక వస్తువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొద్దిరోజులు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు కళాసిల్క్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. మోతీనగర్, ఎర్రగడ్డ, శ్రీరాంనగర్, బోరబండ, అల్లాపూర్ పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అన్ని రకాల డెబిట్, క్రెడిట్ కార్డులపై వస్తువులను కొనుగోలు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

రేషన్‌కార్డుదారులు ఈ–కేవైసీ పూర్తి చేసుకోవాలి

డీఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని రేషన్ కార్డు లబ్ధిదారులు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తమ వేలిముద్ర సాయంతో 100 శాతం ఈ–కేవైసీ పూర్తి చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి (డీఎస్ఓ) శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 5,37,810 రేషన్‌కార్డులకు సంబంధించి 18,65,353 మంది లబ్ధిదారులు ఉండగా.. ఇప్పటి వరకు 13,19,111 (70.72శాతం) మంది లబ్ధిదారులు మాత్రమే ఈ–కేవైసీ పూర్తి చేసుకున్నారని వివరించారు. మిగతా 5,46,242 (29.28శాతం) మంది లబ్ధిదారులు ఈ–కేవైసీని పూర్తిచేసుకోవాల్సి ఉందన్నారు. మిగిలిన వారంతా సెప్టెంబర్‌లో తాము నివసించే ప్రాంతంలో అందుబాటులో ఉన్న రేషన్‌షాపునకు వెళ్లి తమకు సంబంధించిన ఈ–కేవైసీని పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. 5 ఏళ్లు పూర్తి కాని పిల్లలకు ఈ–కేవైసీ నుంచి మినహాయింపు ఇవ్వబడిందన్నారు. రేషన్‌షాపు డీలర్లు కూడా రేషన్‌షాపులను తెరిచి ఉంచి ఈ–కేవైసీ పూర్తి చేసేందుకు సహకరించాలని ఆయన కోరారు.

సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన

దుండిగల్: మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో దుండిగల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంకేతిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రేర్ణ ఔట్రీచ్ పేరుతో నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ సహకారంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల రోజు రోజువారీ జీవితంలో సైన్స్, టెక్నాలజీ పాత్ర గురించి ఆసక్తి కలిగించి వారిని భవిష్యత్‌లో నిష్ణాతులుగా తీర్చిదిద్దే విధంతో పాటు వారి జిజ్ఞాసతో శాస్త్రీయ ఆలోచనను మేళవించి రూపొందించిన కార్యకలాపాలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అరుణ్‌కుమార్, బలరామ్, హెచ్‌ఎంఆర్ ముత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పాపిరెడ్డినగర్‌లో పూజలు చేసిన చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు



సిండికెట్ బ్యాంక్ కాలనీ వినాయకుడిని దర్శించుకున్న కార్పొరేటర్ నరసింహ యాదవ్



ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలోని వినాయకుడి వద్ద ..



మోతీనగర్ కమిటీ హాల్‌లో ఏకదంతుని పూజలో అధ్యక్షులు డాక్టర్ ప్రసాద్, సభ్యులు



మూసాపేట్ జనతానగర్‌లోని వినాయకుడికి పూజలు చేసిన మాజీ కార్పొరేటర్ బాబూరావు

ఘనమైన పూజలు నీకు.. ఓ బొజ్జ గణపయ్య..

మండపాల వద్ద అన్నదానాలు

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో వినాయక నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం పలు మండపాలలోని వినాయక విగ్రహాలకు పలువురు నాయకులు, అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కాలనీల్లో అన్నదానం నిర్వహించారు. పలువురు మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఉదయం, సాయంత్రం గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు.
– కూకట్‌పల్లి, జోన్‌బృందం



ఆల్విన్‌కాలనీ అన్నదానంలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జిల్లా గణేష్‌నేత, పట్వారీ శశిధర్ తదితరులు



అంజయ్యనగర్‌లో గణపతిని దర్శించుకున్న మాజీ కౌన్సిలర్ మక్కల నర్సింగ్‌రావు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్



జనతానగర్‌లో అయోధ్య బాల రాముని రూపంలో వినాయకుడు



కూకట్‌పల్లిలో వినాయకుడి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తదితరులు



కాళీయుడిపై నాట్యం చేస్తున్న కృష్ణుడు, మురళి వాయిస్తున్న ఏకదంతుడు



మూసాపేటలోని వినాయకుడికి పూజలో..



అవంతినగర్ ఈస్ట్ కాలనీలో .. మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ



బాలాజీనగర్ వినాయక మండపంలో జగన్ గురూజీ, జస్వంత్, ఐస్‌క్రీమ్ వెంకటరెడ్డి తదితరులు



ఆల్విన్‌కాలనీలో వినాయక పూజలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు



హైదర్‌నగర్ డివిజన్, అల్లాపూర్ సొసైటీ వద్ద పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్లు



తులసినగర్‌లో బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జి మాధవరం కాంతారావు తదితరులు



ఆంజనేయనగర్‌లో వినాయకుడికి పూజలో స్థానికులు